www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 ఆగస్టు 2024
5
చిత్తూరు

మురుకంబట్టు సర్కిల్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని మురుకంబట్టు సర్కిల్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను కమిషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం సాయంత్రం పరిశీలించారు. మురుకంబట్టు సర్కిల్ సుందరీకరణ చర్యల్లో భాగంగా ఐలాండ్‌లో మొక్కల పెంపకం, ఫౌంటెన్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కమిషనర్ వెంట డీఈ వెంకట ప్రసాద్, ఎఈలు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

గ్రామస్తులు 'ఉపాధి' పనులు నిర్ణయించుకోవచ్చు

నేడు గ్రామసభలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఏఏ పనులు చేపట్టాలో ఆయా గ్రామ ప్రజలు తమ గ్రామ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులను నిర్ణయించుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు నేడు గ్రామ సభలు నిర్వహించనున్నారు. డ్వామా నేతృత్వంలో జిల్లాలోని 700 గ్రామపంచాయితీలో ఒకే శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండీ జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలందాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్తులతో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తుల ఆమోదం మేరకు పనులు నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 82 లక్షల పని దినాలు కల్పించాలి. ఇప్పటి వరకు 34.14 లక్షల పని దినాలు కల్పించారు. మామిడి మొక్కల పెంపకం 6వేల ఎకరాలు, 96 కిలో మీటర్ల సీసీ, బీటి సిసి డ్రైన్స్ లక్ష్యం, 180 సిరికల్చర్ షెడ్ల నిర్మాణం, 875 పశువుల, గొర్రెలు, కోళ్ళషెడ్ల నిర్మాణం లక్ష్యం.

ఉపాధి హామీ చట్టం ఏం చెబుతోంది..

గ్రామప్రజల భాగస్వామ్యంతో గ్రామ ప్రణాళికలు తయారుచేసి వాటి అమలు పరిచినప్పుడే గ్రామ పంచాయితీలు అభివృద్ధి చెందుతాయి. దీనికి గ్రామ సభల నిర్వహణ అన్నది అత్యంత కీలకం. ఉపాధి హామీ చట్టం పేరా 161 ప్రకారం పథకంలో చేపట్టాల్సిన పనులు ప్రాజెక్టులు గుర్తించడం గ్రామపంచాయతీ బాధ్యత. అలాగే చట్టంలోని పేరా 3 ప్రకారం గ్రామసభ సిఫారసులు పరిగణలోకి తీసుకొని గ్రామ ప్రణాళిక, ఉపాధి హామీలు చేపట్టే పనులు షెడ్యూలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన పనుల గుర్తింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 23వ తేదీ రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహించాలని నిర్ణయించారు. ఉపాధి హామీ కూలీల హక్కులు, రాజీలేని అంశాలు ఉపాధి హామీలు చేపట్టే పనులు సామాజిక తనిఖీలు ప్రాధాన్యత వంటి విషయాల పట్ల గ్రామీణులకు అవగాహన కల్పించి తద్వారా నాణ్యమైన పనుల ప్రణాళికలను రూపొందించడానికి ఈ గ్రామ సభలు వేదిక కానున్నాయి. స్వర్ణ గ్రామపంచాయతీ అమల్లో భాగంగా గ్రామసభలు నిర్వహించుకునేందుకు గృహ అవసరాల కల్పనల భాగంగా విద్యుత్ కనెక్షన్స్, కులాయిల ఏర్పాటు, మరుగుదొడ్ల సదుపాయం, ఎల్‌పీజి గ్యాస్ సదుపాయాలు గ్రామపంచాయతీలోని అన్ని కుటుంబాలకు అందించాలి. సాధారణ సదుపాయాల మెరుగుదలతో భాగంగా నీటి సరఫరా పథకం, డ్రైనేజీ సదుపాయం, ద్రవవ్యర్థాల నిర్వహణ, వీధిదీపాలు, సిమెంట్ రోడ్లు ఘన వ్యర్థాల నిర్వహణ వంటి సేవలను అందించాలి. మెరుగైన అనుసంధాన రోడ్లలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మార్కెట్, పట్టణానికి గ్రామ పంచాయితీ, పంచాయతీరాజ్ లింక్ రోడ్లు నిర్మించాలి. స్వయం సమద్ధి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సుస్థిర గ్రామీణ జీవన పరిస్థితులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలి. నీటి సంరక్షణ పనులు, పండ్ల తోటలు, మల్బరీ తోటలను అభివృద్ధి పరచాలి. అలాగే పశువుల షెడ్లను నిర్మించాలి.

ఇవి తప్పనిసరి..

1. గ్రామపంచాయతీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల వేతన ఉపాధి.
2. ఆర్‌ఓఎఫ్‌ఆర్ లబ్ధిదారులకు 150 రోజుల వేతన ఉపాధి.
3. పనిచేసిన 15 రోజుల్లో వేతనం చెల్లింపు.
4. స్త్రీ పురుషులకు సమాన వేతనం.
5. గ్రామసభ మండల పరిషత్ జిల్లా పరిషత్తులు ఆమోదించిన పనులు మాత్రమే చేయాలి.

ఉపాధి కూలీల హక్కులు

1. జాబ్ కార్డులు పొందే హక్కు.
2. పని కోరిన 15 రోజుల్లో పని పొందే హక్కు.
3. పని కోరిన 15 రోజుల్లో పని కల్పించకపోయిన్నట్లేయితే పని కోరిన తేది నుండీ నిరుద్యోగ భృతి పొందవచ్చు.
4. ప్రణాళిక రూపొందించి పనుల జాబితా తయారు చేసే హక్కు.
5. పని ప్రదేశం నివాస గృహానికి ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్నట్లయితే రోజు కూలీకి అదనంగా 10శాతం వేతనం పొందే హక్కు.
6. పని ప్రదేశంలో ప్రాథమిక చికిత్స, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.
7. ప్రకటించిన వేతనం రేటు 300 రూపాయలు వేతనం 15 రోజుల్లో పొందవచ్చు.
8. చేసిన పని కొలతల ఆధారంగా వేతనాలు చెల్లించాలి.
9. వేతనాలు సకాలంలో ఇచ్చినట్లయితే పరిహారంతో కూడిన వేతనం పొందవచ్చు.
10. ప్రదేశంలో కూలీలకు గాయాలైనట్లయితే చికిత్స ఖర్చులు ప్రభుత్వం చెల్లించాలి.
11. పని ప్రదేశంలో కూలీ మరణించినా లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనట్లయితే ఆ కుటుంబానికి 50,000 పొందవచ్చు. కూలి పేరు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రిజిస్టర్ అయి ఉంటే రెండు లక్షలు ప్రమాదభీమా పొందవచ్చు.

వ్యవసాయ అనుబంధ పనులు

కొత్త ఫీడర్ కాలువ తవ్వకం, పంటకాల్వల తవ్వకం, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతు భూముల్లో సేద్యపు నీటి కుంటలు, వృతిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు, వ్యక్తిగత భూముల్లో బెంచ్ ట్రెరసింగ్ తవ్వకాలు, పండ్ల తొటల్లో భూసంరక్షణ కంకాలు, గడ్డిపెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, పట్టుపురుగుల షెడ్లు, కోళ్ళఫరాల నిర్మాణం చేపట్టవచ్చు. ఎస్సీ, ఎస్టీ సన్న, చిన్నకారు రైతులు వందశాతం సబ్సిడీతో గులాబి, మల్లెతోటల పెంపకం, పశువుల గడ్డి పెంపకాలనికి 90శాతం సబ్సిడీ అందనుంది. గురువారం నిర్వహించే గ్రామసభల్లో సమగ్రంగా చర్చించి తీర్మాణం ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. గ్రామసభ నిర్ణయించిన పనుల ప్రాధాన్యత ప్రభుత్వం రూపొందిన గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ గ్రామ సభలకు అందించే పత్రంలో రాతిపూర్వకంగా అందించాల్సి ఉంటుంది.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- అధిక ధరలు వసూలు చేస్తే కఠినచర్యలు
- జిల్లాకు రూ.91 లక్షల ఆదాయం
- ఇప్పటివరకు 74 వాహనాలను సీజ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో 3 డిపోలలో 1,84,519 మెట్రిక్ టన్నుల ఇసుక ప్రస్తుతం అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా సచివాలయం సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలుతో కలసి ఇసుక విధానంకు సంబంధించిన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ధరకు ఇసుకను ప్రజలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఇందుకు సంబంధించి జిల్లాలో రవాణా శాఖ, మైన్స్, సంబంధిత శాఖ అధికారులతో ఏర్పాటైన కమిటీ స్థిరమైన రవాణా ఛార్జీలతో కలిసి ఇసుకను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇసుక విధానంకు సంబంధించి ఇసుక అక్రమ రవాణా కట్టడికి వినియోగదారులు, డిటిసి, ప్రజలు, పోలీసులు, మీడియా నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నామని ప్రతి 15 రోజులకు ఒకసారి శాస్త్రీయంగా సర్వే చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 58వేల మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకం ద్వారా జిల్లాకు రూ.91 లక్షల ఆదాయం చేకూరిందని, ఇసుక అక్రమ రవాణా కట్టడికి పూర్తి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 74 వాహనాలను సీజ్ చేశామని, ప్రతి వాహనం నుండి 4 నుండి 5 మెట్రిక్ టన్నులు ఇసుకను తీసుకోవడం జరిగిందని దాదాపు 3,50,000 వరకు అపరాధ రుసుం రూపంలో వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని, ఇసుకను తరలించే వాహనదారులు నిర్ణయించిన ధరలకు అందజేయాలని తెలిపారు. గత 45 రోజుల నుండి జిఎస్‌టి, సీనరేజ్, జెసిబి లోడింగ్ చార్జెస్, ఎన్విరాన్మెంట్ టాక్స్ కలిపి ఒక మెట్రిక్ టన్నుకు రూ.155లు చెల్లించవలసి ఉంటుంది ప్రతి రోజూ 2డిపోల నుండి ఇసుక అమ్మకం జరుగుతున్నదన్నారు. ఎస్‌పితో కలసి ఇసుక డిపోలలో ఇసుక అమ్మకం విధానంను పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. 10 కిమీ లోపు రూ.1200, 10 నుంచి 15 కిమీల పరిధిలో రూ.1400, 15 నుంచి 20 కిమీల పరిధిలో రూ.1600, 20 నుంచి 25 కిమీల పరిధిలో 1800, 25నుంచి 30 కిమీల పరిధిలో రూ.2000 ఇలా రవాణా ఛార్జీలు నిర్ణయించడం జరిగిందన్నారు. గరిష్ట ధర దాదాపు రూ.2,700లకే 5 మెట్రిక్ టన్నుల ఇసుక సమకూర్చడం జరుగుతుందని, అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ రెండు స్టాక్ పాయింట్ ల నుండి 1500 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని, మరో 80 రోజుల వరకు అమ్మకానికి సరిపడా ఇసుక స్టాక్ పాయింట్‌ల వద్ద ఉందని, సచివాలయంలో నగదు చెల్లించి రసీదు తీసుకుని ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక కొనుగోలు చేయవచ్చునన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, మైన్స్ డిడి ప్రసాద్ చిత్తూరు ఆర్‌డిఓ చిన్నయ్య పాల్గొన్నారు.

'కొనసాగుతున్న విచారణ'

విద్యార్థులను పరామర్శిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతీదేవి అస్వస్థకు గురైన విద్యార్థులను అపోలో మెడికల్ క్యాంపులో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ రంగనాథంతో సమీక్షించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఎవరిని ఇంటికి పంపవద్దని, లామా కేసెస్ ఫాలో ఆఫ్‌కి ఇబ్బంది అవుతుందని, ప్రతి సిక్ కేస్‌కి రెగ్యులర్ ఫాలోఅప్ ఉంటుందన్నారు. తిరుపతి నుంచి ఆర్‌ఆర్‌టి టీం వచ్చిందని ఫైనల్ ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని, విద్యార్థులు ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత మలవిసర్జన తర్వాత భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతుల శుభ్రత పాటించాలని, ఓఆర్ఎస్ ద్రావణం విరివిగా తీసుకోవాలని, తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్, శ్రీవాణి పాల్గొన్నారు.

లేఔట్లలో వేగంగా ఇంటి నిర్మాణాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని లేఔట్లలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ నగర పరిధిలోని అనుప్పల్లి లేఔట్‌లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఇందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వందరోజుల హౌసింగ్ ప్రోగ్రాంలో భాగంగా హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులు, మెప్మా సీవోలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. లేఔట్లలో పునాదులు పూర్తై వివిధదశల్లో ఉన్న నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలని, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా అధికారులను ఆదేశించారు. వార్డువారీగా రుణాలు పొందడానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు మంజూరు చేయడంతో పాటు, ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వార్డు వారీగా నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఈ శ్రీధర్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నీటి కుళాయి సర్వే పూర్తి చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంటింటికి నీటి కుళాయి సర్వేను సత్వరం పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఇంటింటికి నీటి కొళాయి సర్వే, పన్నుల వసూలు, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాం అంశాలపై సంబంధిత అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం నీటి కుళాయి సర్వే చేయిస్తుందని అన్ని వార్డుల్లో సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. వార్డుల వారీగా సమీక్షిస్తూ ప్రతి ఇంటిని సర్వే చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. రికార్డులో ఉన్న కనెక్షన్లు, లేని కనెక్షన్లు, రికార్డుల్లో ఉన్న క్షేత్రస్థాయిలో కనెక్షన్ లేనివి వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. వార్డు స్థాయిలో మిగిలిన సర్వేను సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై వార్డువారిగా సమీక్షించారు. హౌసింగ్ ప్రోగ్రాంపై దృష్టి సారించాలని, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సూపర్వైజర్ అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతి సిడిపిఓపై చర్యలు

కలెక్టర్, ఎమ్మెల్సీలకు సిఐటియు ధన్యవాదాలు

కుప్పం సిడిపిఓ అరుణశ్రీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కుప్పం అవినీతి సిడిపిఓపై రకరకాల పోరాటాలు ఫలితంగా కలెక్టర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు స్పందించి చర్యలు తీసుకోవడాన్ని సిఐటియు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, సీనియర్ నాయకులు ప్రమీళలు మాట్లాడుతూ కుప్పం ప్రాజెక్టు సిడిపిఓ అరుణశ్రీ అంగన్వాడీలను రకరకాల కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఇబ్బందులు గురి చేసిందని తెలిపారు. అకారణంగా ఇద్దరినీ టెర్మినేషన్ చేసిందని కోర్టుకెల్లి మళ్లీ విధుల్లోకి చేరిన పరిస్థితి ఉందన్నారు. అలాగే మొన్న జరిగిన అంగన్వాడీ ఇంటర్వ్యూలలో అవకతవకలకు పాల్పడుతూ అర్హులైన ప్రమోషన్ మినీ వర్కర్‌కి ఇవ్వకుండా కొత్తవారికి ఇచ్చి అవినీతికి పాల్పడిందన్నారు. జిల్లా అధికారులు కూడా లెక్కచేయకుండా వ్యవహరించిన సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు, రాష్ట్ర అధికారులకు సిఐటియు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడంతో స్పందించి కుప్పం నుంచి చిత్తూరు ఆఫీస్‌కి సరెండర్ చేసుకున్నారని, ఈ ఘటనపై అధికారుల స్పందనకు సిఐటియు ధన్యవాదాలు తెలియజేస్తున్నదన్నారు. అలాగే కింగ్ మేకర్‌గా వ్యవహరిస్తున్న సీనియర్ అసిస్టెంట్‌పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై వ్యక్తిగతంగా తమకు ఎలాంటి ద్వేషం లేదని సమస్యలను పరిష్కారం చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తే ఇదే పద్ధతులో పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కుప్పంలో ఎవరు వచ్చినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ విధులు నిర్వహించాలని అంగన్వాడీలను అకారణంగా ఇబ్బందులు పెట్టవద్దని హితవు పలికారు. అంగన్వాడీలు ఐక్యంగా పోరాటం చేసి సమస్యలు పరిష్కారం కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు.

అంగన్వాడీ సెంటర్‌ను ముట్టడించిన గ్రామస్తులు

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కనమపల్లి అంగన్వాడీ వర్కర్ పోస్టును అక్రమంగా కన్నడ చదువుకున్న వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు ఇవ్వడం దారుణమని గ్రామస్తులు, టిడిపి నాయకులు ఆరోపించారు. అక్రమ పోస్టింగ్‌ను రద్దుచేయాలంటూ గురువారం అంగన్వాడీ సెంటర్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా అక్రమంగా వర్కర్‌ని పెట్టి పనిచేయించారని ఈ విషయంపై పదేపదే అధికారులు దృష్టికి తీసుకువచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయాలని నోటిఫికేషన్ ఇస్తే అర్హులుగా ఉన్నవారు అప్లై చేసిన వారి అప్లికేషన్లు జిల్లాకు సమాచారం ఇవ్వకుండా స్థానిక రాజకీయ నాయకుల అండతో అక్రమంగా జయలలిత అనే ఆమెకు ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే మా ఊరిలో ప్రమోషన్ అర్హత కలిగిన చౌడమ్మ ఉన్నప్పటికీ ఆమె ఇవ్వకుండా ఇంకా అర్హులు అప్లై చేసిన వారికి ఇవ్వకుండా అడ్డదారులో పోస్ట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పదేపదే ఆర్డిఓ దృష్టికి స్పెషలాఫీసర్ దృష్టికి తీసుకువచ్చిన ప్రాజెక్టు అధికారులు వారికి కావలసిన వారికి ఇవ్వడం వెనక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా నియమించిన పోస్ట్ రద్దు చేసే అంతవరకు తమ పిల్లలను సెంటర్‌కి పంపమని, ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. తప్పుడు పద్ధతుల్లో వ్యవహరిస్తున్న ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు అరుణశ్రీ, ఉదయ్ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని మండల టిడిపి అధ్యక్షులు బాబు నాయుడు డిమాండ్ చేశారు.

అంగన్వాడీ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి: ఎమ్మెల్యే గురజాల

డయల్ యువర్ ఎమ్మెల్యేకు 37 ఫిర్యాదులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందే ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు స్వీకరించారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన సమస్యలను విని నమోదు చేసుకున్నారు. పలు సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానంగా ట్రాన్స్‌కో, రెవెన్యూ, పోలీస్ విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నాయని వీటిని పరిష్కరించాలన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థకు సంబంధించి నీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిత్తూరును మార్చాలి.. అందంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 8న జరిగిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో అందిన 34 ఫిర్యాదుల్లో 19 పరిష్కరించగా.. 15 పురోగతిలో ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించి 21 ఫిర్యాదులందగా 15 పరిష్కరించామని, 6 పనులకు సంబంధించి అంచనాలు రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, నగరపాలక సంస్థ, చిత్తూరు రూరల్, అర్బన్, మండలాల అధికారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మొత్తం ఫిర్యాదులు 37 అందాయి. ఇందులో నగరపాలక సంస్థ 21, రెవెన్యూ 5, పోలీస్‌శాఖ 4, ట్రాన్స్ కో 4, ఏపీఐఐసీ 2, ఐసీడీఎస్ 1 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు.

అనుమతి లేని స్కానింగ్ సెంటర్లపై దాడులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో గురువారం చిత్తూరులో స్కానింగ్ సెంటర్స్‌పై రైడ్ చేసినట్లు జిల్లా పిసిపిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయనతోపాటు టీం డాక్టర్ పూర్ణికల, డాక్టర్ సాయిరాం హాస్పిటల్‌లో విజిట్ చేసి పలు రికార్డులను పరిశీలించి రిమార్క్స్ నోట్ చేశారు. రిజిస్ట్రేషన్ కానీ స్కానింగ్ మిషన్స్ అన్నీ కూడా సీజ్ చేస్తామని తెలిపారు. రెన్యువల్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని, అబార్షన్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, అన్ని డీటెయిల్స్ రిజిస్టర్‌లో పొందుపరచాలని తెలిపారు. లింగ నిర్ధారణ ఎట్టి పరిస్థితుల్లో చేయరాదని అలా చేసిన పక్షంలో సదరు డాక్టర్‌కి, గర్భిణీకి, ఆమె వెంట వచ్చిన వారికి ముగ్గురికి తప్పనిసరిగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ విషయాన్ని పారామెడికల్ సిబ్బంది ప్రజలకు విపులంగా అవగాహన చేసి సెక్స్ రేషియోని పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డేమో జయరాముడు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- పలమనేరు: కలకత్తా ఆర్‌జికార్ వైద్య కళాశాలలో పిజి మహిళా డాక్టర్‌పై జరిరగిన అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలి ఐద్వా, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఆశ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. కలకత్తాలో మహిళ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం జయంతి ధనమ్మ, ఆశా వర్కర్ల సావిత్రి, కైరునిషా, మంగమ్మ, రాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను తనిఖీ చేసిన పీడీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎన్.రాజశేఖర్ పెనుమూరు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. మండలంలోని పులికల్లు గ్రామపంచాయతీలో జరుగుతున్న కాలవ పూడికతీత పని తనిఖీ చేసి అక్కడ ఉన్నటువంటి కూలీలతో చర్చించడం జరిగినది తరువాత మదర్ ఫర్ ప్లాంట్ కార్యక్రమం భాగంగా గొడుగుమాను పల్లి, రామకృష్ణాపురం పంచాయతీలోని అట్లవారిపల్లిలో చెట్లు నాటడం జరిగింది. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్నటువంటి ప్రతి గ్రామంలో కూడా కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని మండలంలో అమృత్ సరోవర్ మినీ అమృత్ సరోవర్ పనులు, రైతుల పొలాల్లో ఫారం పాండు, రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వ ఆఫీసు ఆవరణంలో స్కూలు కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటించాలని, చిన్న సన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం, పూల సాగులో రోజా, మల్లెపూల సాగు పనులు గుర్తించి రైతులకు పనులు కల్పించాలని, మండలంలో పనులను వేగవంతం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపిడి సుబ్రహ్మణ్యం, ఎంపిడిఓ నీలకంఠేశ్వర్ రెడ్డి, అదనపు ప్రోగ్రాం అధికారి డాక్టర్ గుణశేఖర్, ఈసి సతీష్, సాంకేతిక సహాయకులు వినోద్, పరదేశి, క్షేత్ర సహాయకులు నరసింహులు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఏపీ ప్రగతికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోంది : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమర్థవంతమైన పాలనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలువుటద్దమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండు కండ్లుగా భావించి.. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారానే ఏపీ ప్రగతి సాధ్యమని సంకల్పించి విజన్ -2047 ఏకైక ఎజెండాతో ముందుకు సాగుతున్న వైనం సీఎం చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌తో కలిసి ఏపీ పురోభివృద్ధి కోసం ముందుకు సాగుతున్న తాజా పరిణామాలపై ప్రసాద రావు గురువారం స్పందించారు. చిత్తూరు పార్లమెంటు అభివృద్ధికి సంబంధించి ఎన్నికల సందర్భంగా తాను గుర్తించిన సమస్యలన్నింటిని ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. చిత్తూరు పార్లమెంట్ అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీపడకుండా ముందుకెళ్లమని తనను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలోనే చిత్తూరు పార్లమెంటులో నెలకొన్న మామిడి రైతుల సమస్యలు, వాటి పరిష్కారానికి ముందడుగు వేయడంతో పాటు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, రైళ్ల రాకపోకలకు సంబంధించి ఆయా శాఖల కేంద్రమంత్రులకు వినతి పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యను రూపుమాపడం కోసం ఎంఎస్ఎంఈలను నెలకొల్పే దిశగా ప్రయత్నాలు చేసినట్లు పేర్కొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- చర్యలు చేపట్టాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇరుకైన రోడ్లలో నిత్యం వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉన్నాయి. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైందని దీనిపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. గురువారం టిడిపి పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన సుకుమార్ బాబు ట్రాఫిక్ సమస్యను వివరించారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తించారు.

'ఆప్టికల్ గ్రౌండ్ వైర్ పనులకు సహకరించండి'

ప్రజాశక్తి-పుంగనూరు: ఏపీ ఫైబర్ వర్క్ పనులలో భాగంగా పుంగనూరు-పలమనేరు ఆప్టికల్ గ్రౌండ్ వైర్ పనులు ప్రారంభమవుతాయని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ శ్రీనివాస్ మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 132కెవి పనులు జరుగుతున్నట్లు వివరించారు. పుంగనూరు 132/33 కేవి సబ్ స్టేషన్‌కు 132కెవి మదనపల్లి సబ్‌స్టేషన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. వీటిలో ఏదైనా విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందిఇవ్వాలని కోరారు. ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మెగస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని యుఎం పురంలో దాతలు విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణగా ఇచ్చారు. స్థానికం ప్రాథమిక పాఠశాలలో దాత సెల్వరాజ్ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, జామెంట్రీ బాక్స్, స్వీట్స్, చాకెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సబర్మతి, ఉపాధ్యాయులు కోకిల, ఝాన్సీ, దుర్గా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి: వంశీ చౌదరి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: భూ సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్‌కి టిడిపి మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు భాష్యం వంశీ చౌదరి విజ్ఞప్తి చేశారు. గురువారం తహశీల్దార్‌ని ఆయన కార్యాలయంలో కలిశారు. వివిధ భూ సమస్య లపై రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతు న్నారని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టి న్యా యం చేయాలని కోరారు. గ్రామస్తులు మధుసూ దన్ నాయుడు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో కొత్తపేట క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను గురువారం టిడిపి నాయకులు గోపీనాథ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు ఆసక్తి కనపరచడం ఆనందంగా ఉందన్నారు. అలాగే క్రీడాకారుల మధ్య పోటీలు స్నేహపూర్వకంగా ఉండాలని, గెలుపోటములు ఏదైనా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపేట ఇన్‌ఛార్జ్ అప్పు, మాజీ గంగమ్మ గుడి ఛైర్మన్ ఆర్ఆర్ రవి, లయన్స్ క్లబ్ సలహాదారులు మహేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి సీఐకి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి అలిపిరి నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన సిఐ రామ్ కిషోర్‌ని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొట్టె హేమంత్ మాట్లాడుతూ అలిపిరి పరిధిలో గంజాయి, బైక్ రైసింగ్లలను అరికట్టి విద్యార్థులకు మంచి మార్గంలో నడిచే విధంగా కృషి చేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో షాపులు తెరుచుకొని అధిక ధరలకు తినుబండారాలు, భోజనాలు, టీ లు అమ్ముతూ యాత్రికులను ఆర్థిక దోపిడీ చేస్తున్నటువంటి హోటళ్లపైన, షాపుల పైన చర్యలు తీసుకోవాలని నూతన సీఐ రామ్ కిషోర్‌ని కోరారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో లో ఉన్న ప్రాంతంలో రాత్రి సమయంలో నిఘా, భద్రతలను పెంచి అల్లరి మూకలను అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జానకిరామ్, జ్ఞానేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు.. తప్పని పాట్లు

- ఇబ్బంది పడుతున్న ఆరు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-గంగవరం: గ్రామీణ ప్రాంత రోడ్లు అద్వానంగా మారాయి. సగం సగం పనులతో నిలిచిన రోడ్డు పనులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని పలమనేరు-శంకరాల్పేట రహదారి నుంచి చౌరిరెడ్డిపల్లి మీదుగా చెన్నారెడ్డిపల్లికి వెళ్లే దారి, అక్కడి నుంచి కీలపల్లి మీదుగా బాలేపల్లికు వెళ్లే దారి, అప్పిశెట్టిపల్లి గ్రామ రోడ్లు అద్వానంగా మారాయి. గంగ్రాజుపల్లి నుంచి మర్లపల్లి మీదుగా చమకలపల్లికి వెళ్లేదారికి గత ప్రభుత్వంలో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. అప్పట్లో ఆ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. వంద మీటర్లు కూడా పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో ఆ దారులన్నీ గుంతలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డంతా నీరు చేరి బురదమయమై అద్వాన రీతిలో దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లలేక, తప్పక ప్రయాణించాల్సి వస్తే సాహసం చేయాల్సి వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసి సౌకర్యం కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

- పశువైద్యాధికారి చందన ప్రియ



గాలికుంటు వ్యాధి టీకాలను వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ ముడింవారిపల్లిలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో 105 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి చందన ప్రియ తెలిపారు. ఈ టీకాలను 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వేయడం జరుగుతుందన్నారు. 19 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించినట్లు వివరించారు. 25 దూడలకు నట్టల నివారణ మందు తాపించినట్లు చెప్పారు. పాడి రైతులు తప్పనిసరిగా సకాలంలో పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజ, సురేష్, మహేష్, సహదేవ, అనూష పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-సోమల: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించడం వల్ల అధిక లాభాలు, ఆరోగ్యం పొందొచ్చునని రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు ఇచ్చారు. గురువారం మండలంలోని 81 ఉప్పరపల్లిలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణిలు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్కడికి వచ్చిన రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానం పట్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం రైతుల పంటలను పరిశీలించి పలు సలహాలిచ్చారు. రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుధాకర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది కుమార్, మంజునాథ్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి గ్రామ సభలు

ప్రజాశక్తి-సదుం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాజశేఖర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25వ ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించిన పనులు, బడ్జెట్, ప్రణాళికలు, తీర్మానాలపై ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా పంచాయతీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాలు, రైతులు, వయోజనులు తప్పక హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్ఆర్ పురం: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు గురువారం ఎంపిడిఒ మోహన మురళి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి హామీ పనులకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. సిబ్బంది ఆయా పంచాయతీల్లో శుక్రవారం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

గంగవరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో జరిగే గ్రామ సభలు ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

సోమల: గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించబోయే గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తైనట్లు వివరించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి ద్వారా దాతల దాతృత్వంతో సౌమ్య పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా శ్రీ షిరిడీ అక్షయ సాయి సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య మాట్లాడుతూ 2002 సంవత్సరం నుండి శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్టు గ్రామానికి చెందిన దేగా గిరి కుమార్తె సౌమ్య విద్యార్థినికి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు రావడంతో బిల్డింగ్ ఫీజు, వ్యాన్ ఫీజు నిమిత్తం తమ ట్రస్ట్‌ను ఆశ్రయించారని, శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ద్వారా పదివేల రూపాయల చెక్కును అందించామని తెలిపారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ట్రస్ట్ నిర్వాహకు లకు కృతజ్ఞ తలు తెలిపారు. ట్రస్ట్ నిర్వాహకులు అల్లం రమణయ్య, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు పుణేంద్ర నాగూర్ రెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

అదనపు ఎస్‌పిలకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బదిలీపై వెళుతున్న జిల్లా అదనపు ఎస్పీలు కులశేఖర్, విమల కుమారికి జిల్లా పోలీసులు ఘనమైన ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ అతిథిగృహం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీడ్కోలు కార్యక్రమానికి విచ్చేసిన ఎస్‌పి ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, నేర నియంత్రణకు ప్రతి రోజూ కొత్త సవాళ్లతో కూడుకుని వుంటుందని ఇందుకు తమ వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకుని వచ్చారన్నారు. హోంగార్డ్ నుండి ఉన్నతాధికారి వరకూ అందరికీ సముచిత స్థానాన్ని ఇచ్చి, ప్రతి ఒక్కరితో స్నేహభావంతో మాట్లాడి వారిలో మెరుగైన ఫలితాలను పొందారన్నారు. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణం కోసం పోలీసు వ్యవస్థ ఎంతో కీలకం.. అని గుర్తించి తాము పని చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగంతో పని చేయించి, పోలీస్ అధికారులకు ఆదర్శవంతంగా నిలిచారని ప్రశంసించారు. బదిలీపై వెళుతున్న అదనపు ఎస్పీలు మాట్లాడుతూ మాకు ఇక్కడ పనిచేయడం గొప్ప వరమని పోలీస్ శాఖ అండతో ఇన్ని రోజులు ఇక్కడ సమర్థవంతంగా విధులు నిర్వహించడం గొప్ప అనుభూతి అని భావోద్వేగంతో అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణ రావు, రాజేంద్ర, శ్రీనివాసరావు, జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొని ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మహిళా వర్సిటీలో 'నేను మీకు తెలుసా?'పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వే ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో 'నేను మీకు తెలుసా?' అనే అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహిం చారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్లను సేవలను విద్యార్థినులకు తెలిపేందుకు ఆర్‌పిఎఫ్ సిఐ సికే మధుసూదన్, ఫైర్ డిపార్ట్మెంట్ మునిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంట్లో గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదం, నీళ్లలో ప్రమాదం జరిగినప్పుడు మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో లైవ్ డెమోతో తెలిపారు. రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మాట్లాడుతూ విద్యార్థినులు డ్రగ్స్‌కు బానిసలు అయినందు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మానస హాస్పిటల్ నుండి సైక్రియాటిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్, సైబర్ క్రైమ్ నుండి సీనియర్ కానిస్టేబుల్ సి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలలో సైబర్ నేరాలు మోసాల బారి నుండి ఎక్కడికీ వెళ్లకుండా ఒక్క ఫోన్ కాల్‌తో 'మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి?' తెలిపారు. 100, 108, 104, 181, 112, 101,1098,139,1930 ఈ టోల్ ఫ్రీ నెంబర్లకు సంబంధించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం విద్యావతి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ యువశ్రీ, డాక్టర్ మాధురి, డాక్టర్ సుజాత, వజిహభాను, డాక్టర్ భార్గవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిరు అభిమానం

- ఆకట్టుకున్న చిత్రాకారుడి ప్రతిభ

ప్రజాశక్తి-కుప్పం రూరల్: సినీ నటుడు చిరంజీవిపై ఓ చిత్రాకారుడి చిరు అభిమానం చక్కటి చిత్రానికి రూపం దాల్చింది. వినూత్నంగా 3డి చిత్రాన్ని చిత్రీకరించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. కొణిదల కుటుంబానికి చెందిన చిరంజీవి, పవన్‌కళ్యాణ్, రామ్‌చరణ్‌ల ముఖాలు ఒకే చిత్రంలో కనిపించేలా ఆ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. గురువారం మెగస్టార్ చిరంజీవి జన్మదినం కావడం, అదే రోజున తన ప్రతిభతో చిత్రాకారుడు పురుషోత్తం గీసిన ఆ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. చిత్రం వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు పలువురు ఉత్సాహం చూపారు. అత్యుత్తమ ప్రతిభతో చక్కటి చిత్రాన్ని పరిచయం చేయడంపై పురుషోత్తంను పలువురు అభినందించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లిలో టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు గురువారం ప్రారంభించారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేందుకు నిర్ణయిం చి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరత్నం, సెల్వ రాజు, గణేష్ పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: వధూవరులను ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ఆశీర్వదించారు. వికోట పట్టణంలోని పీఎంఆర్ కళ్యాణ మండపంలో గురువారం బైరెడ్డిపల్లి టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి కుమార్తె లావణ్య వివాహ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వ్యాధి, కలుషిత నీరు ఆహారం ద్వారా వ్యాపించే వాంతులు, విరోచనాలు, కుష్టు వ్యాధి నివారణపై స్థానిక అక్షర ప్రైవేటు పాఠశాలలో వైద్యాధికారులు గురువారం అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల విసర్జన తరువాత ఆహారం తీసుకునే ముందు, చిన్న పిల్లలు ఆటలాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, ఫ్రైడే డ్రై డే పాటించి దోమలను అరికట్టాలని సూచించారు. ఇంటి ఆవరణలో వ్యర్థాలైన కప్పులు టెంకాయ చిప్పలు రోళ్లు పనికిరాని కుండలు, డబ్బాలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు కాచి చల్లార్చి తాగడం ద్వారా, వేడి, తాజా ఆహారం తీసుకోవడం ద్వారా విరోచనాలు, వాంతుల నుండి రక్షించుకోవచ్చని తెలిపారు.

విద్యార్థినికి నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలోని రామగిరి, అడివి కండ్రిగ ఎంపిపి పాఠశాలలో చదువుతున్న 32 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గౌరి సమక్షంలో ఆలయ ఛైర్మన్ కేఎల్ వెంకటేశ్వర్లు, ఎల్ సెల్వం గురువారం అందించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కూలీలకు కల్పించండి

- సర్పంచ్‌లు, ఎంపీటీసీల డిమాండ్

ఎంపీడీవోకి వినతి పత్రం అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కూలీలకు కల్పించాల్సిన ఉపాధిని యంత్రాలకు కల్పిస్తున్నారని, వెంటనే ఆ పనులు ఆపి పేదలకు ఉపాధి పనులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు, ఎంపిటీలు ధర్నా చేపట్టారు. గురువారం బైరెడ్డిపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మండలంలో రూ.6కోట్ల పనులు మంజూరైనప్పటికీ కూలీలకు కాకుండా యంత్రాలతో పనులు చేపట్టారని ఆరోపించారు. వైసీపీకి చెందిన వారినే ఉద్దేశ్యంతో అన్యాయంగా 11మంది సిబ్బందిని తొలగించారని మండిపడ్డారు. వెనువెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని, పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు.

మానవ జీవితానికి నమ్మకమే పునాది

- ప్రముఖ తత్వవేత్త రాధాకృష్ణ రావు

ప్రజాశక్తి-పుంగనూరు: మానవ జీవితానికి మన నమ్మకమే పునాది అని ప్రముఖ మానసిక తత్వవేత్త మందుమూల రాధాకృష్ణ రావు అన్నారు. పట్టణంలోని ఎంసీబీ డిగ్రీ కళాశాల ఆవరణంలో గురువారం ఛైర్మన్, ప్రిన్సిపల్ రాధాకృష్ణ అధ్యక్షతన విద్యార్థులకు జీవిత సత్యాలపై సందేశం ఇచ్చారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజ భవిష్యత్తు యువత నడవడిక పైన, ఆలోచనల పైన ఆధారపడి ఉంటుందన్నారు. వ్యక్తి మనుగడకు మంచి ఆలోచన అవసరమని తెలిపారు. జ్ఞాపకశక్తి పరీక్ష విధానాలను గూర్చి ఉదాహరణతో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.

బంగారమ్మ ఆలయంలో కుంభాభిషేక వేడుక

హోమాలు చేపడుతున్న వేదపండితులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: బంగారమ్మ ఆలయంలో ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలు గురువారం వేకువ జామున 4గంటలకు ప్రారంభమైయ్యాయి. మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ట, పంచాంగమ్య ప్రాశన, అకల్మష హోమం, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తుపర్యాగ్నికరణం, గోపూజ లక్ష్మీనారాయణ పూజ వేదపండితుల నిర్వహించారు. ఈ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు కె.ప్రసాద్ పేర్కొన్నారు. సాయంత్రం గణపతి పూజ, రక్షబంధన పూజ, కంకణ ధారణ, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ట, ఉక్త హోమం, లఘు పూర్ణహుతి, వాంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కే.ప్రసాద్, హరిత దంపతులు, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లే దంపతులు, శిరీష, భక్తులు పాల్గొన్నారు.

హోటల్స్‌లో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణ సుందరీకరణకు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణ పరిధిలోని ముఖ్య కూడలి ప్రాంతాలలో ఐమాక్స్ లైట్స్ ఏర్పాటుకు పట్టణంలోని పలు కూడలి ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పట్టణ పరిధిలోని భోజన విక్రయశాలలను స్థానిక పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టార్ హోటల్, నూర్ హోటల్‌లో చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తినుబండారాలు విక్రయించే వ్యాపారులు ఎవరైనా చెడిపోయిన ఆహారాన్ని ప్రజలకు అందిస్తే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానా విధించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. వ్యాపారాలు ఎప్పటికప్పుడు తాజా ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఈ విషయాన్ని వ్యాపారులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ జిటి నాయుడు, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గం మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి బైరాగి పట్టెడలోని ఓ ప్రైవేటు స్కూల్లో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఓ ప్రైవేటు స్కూల్లో ఉదయం 9.30 గంటల సమయంలో మూడో అంతస్తులోని ఓ గదిలో మంటలు వ్యాపించాయి. అదే సమయంలో విద్యార్థులు క్రీడ మైదానంలో ప్రార్థన ముగించుకొని తరగతి గదిలోకి వెళుతున్నారు. మంటలు రావడాన్ని పసిగట్టిన స్కూల్ సిబ్బంది విద్యార్థులను అక్కడి నుంచి పక్కనున్న అపార్టుమెంటులోకి క్షేమంగా తరలించారు.స్కూలు యజమాను సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు. స్కూల్ మిద్దె పైన ఫర్నిచర్ వేచి ఉన్న గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంబంధించిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, ఓ రెండు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. విషం తెలుసుకున్న డిప్యూటీ డిఇఓ బాలాజీ నాయక్ ప్రమాదం జరిగిన స్కూల్ వద్దకు చేరుకుని అక్కడ పరిస్థితు లను పరిశీలించారు. ఎలా జరిగిం దన్న విషయం స్కూలు యాజమాన్యాన్ని అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నారని తెలుసు కోవడంతో, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకో వాలని సూచించారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రొఫెసర్ చలిచీమ లపల్లి కులాల జయశంకర్ (ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్)కు అరుదైన ఎర్త్‌ల పరి శోధన, అభివృద్ధి, అప్లికేషన్‌ల రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గౌరవార్థం రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆర్ఈఏఐ లైఫ్‌టైమ్ అచీవ్ మెంట్ అవార్డుకు మరో ప్రతిష్టాత్మకమైన గుర్తింపు లభించింది. ఈ నెల 21న తిరువనంతపురంలో జరిగిన రేర్ ఎర్త్స్ సైన్స్ అండ్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సు -2024, మెరిసే ప్రారంభ సెషన్‌లో ఈ అవార్డును ఆయన స్వీకరించారు. ఆర్ఈఏఐ అధ్యక్షుడు దీపేంద్ర సింగ్, ఐఆర్ఈఎల్ (ఇండియా) లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్‌పిఎల్ రెడ్డి, లేజర్‌లు, ఆప్టికల్ ఫైబర్ యాంప్లిఫైయర్‌లు, సెన్సార్‌లు, బయోలేబుల్‌లు, డబ్ల్యూ-ఎల్ఈడీల వంటి వివిధ అప్లికేషన్‌ల కోసం అరుదైన ఎర్త్-డోప్డ్ ఆప్టికల్ క్వాలిటీ గ్లాసెస్, నానో-గ్లాస్ సిరామిక్స్, నానోక్రిస్టలైన్ మెటీరియల్‌ల తయారీ, క్యారెక్టరైజేషన్, ఆప్టి మైజేషన్‌పై అతను అద్భుతమైన కృషి చేశాడు. ఈ సందర్భంగా ఆర్ఈఏఐ అసోషియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పి రెడ్డి, ఎస్‌వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సిబ్బంది ప్రొఫెసర్ బి దేవప్రసాద్ రాజుతో సహా ఆయన అద్వితీయ విజయాన్ని అందుకున్నారు.

బాలికలకు పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక అంగన్‌వాడీ సిడిపిఓ మునుకుమారి ఆధ్వర్యంలో కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిషోర్ బాలికలకు 'బేటి బచావో బేటి బడావో' కార్యక్రవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిడిపిఓ మణికుమారి, సూపరువైజరు ఐ కృష్ణమ్మ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలు వివాహాలు చేసుకోకూడదని విద్యార్థు లకు వివరించారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ పౌష్టికాహారం గురించి తెలిపారు. పిల్లలకు పలురకాల సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమం లో మమత, సుందరమ్మ, పెంచలమ్మ, ఝాన్సీలు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు కృషి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక పాలనకు కృషి చేస్తానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజక వర్గంలో ప్రభుత్వ కార్యాలయాలలో ఎమ్మెల్యే పేరుతో ఎవరు వసూళ్లకు పాల్పడినా సహించేది లేదని నియోజకవర్గ ప్రజలంతా దీన్ని గ్రహించాలని ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేసేందుకే వున్నాయని వారిని పదే పదే తిప్పించుకోవడం తగదని హితవు పలికారు. పుత్తూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రికార్డు రూమ్ శిథిలావస్థకు చేరుకోవడంతో కలెక్టర్ ద్వారా నూతన భవనాన్ని మంజూరు చేయిస్తానని అధికారులు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ యోగానంద్, తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది, ధనపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.